# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 2 వేల 500 కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

2. **ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు.**

4. **రైతులకు సాగు ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 2 వేల 500 కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, నివాస భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్గం నిన్న ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీలో పాత్రికేయులకు వెల్లడిస్తూ,

వాయిస్..25.. సెకన్లు

అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయ వసతి సముదాయం-సీజీజీపీఓఏ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, రాష్ట్రంలోని వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోటకు తీసుకురావడం ద్వారా పరిపాలన మరింత సులభతరం అవుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఆమోదం లభించడం అమరావతి అభివృద్ధిలో మరో ముఖ్యమైన ముందడుగని పేర్కొన్నారు

-------------------------

భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా నిలపగల నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీయేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగిన నాయకుడిగా నరేంద్రమోదీ రికార్డు సృష్టించిన నేపథ్యంలో ఢిల్లీలోని భారత్ మండపంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, పార్టీ అధ్యక్షులతో నిన్న నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు

నాయుడు 11 పేజీల కృతజ్ఞతా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రపంచం ప్రస్తుతం ఇంధన మార్కెట్ సంక్షోభం, ఆర్థిక మందగమనం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---

ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో నిర్మించనున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో నిన్న 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ –ఎఫ్‌సీడీఏ' భవనాన్ని ప్రారంభించిన అనంతరం బహిరంగసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్య సాధనలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కాలుష్య రహిత, ఆధునిక, ప్రపంచ స్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని, దాని పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తానని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

---

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. అమరావతిలో ఇంధన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం కీలకమని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెంటనే సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

---

ఆంధ్రప్రదేశ్ లో అక్రమ గనుల తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, గనుల తవ్వకాల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు నిలిచిపోయిన లీజులు, పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గనుల అనుమతుల ప్రక్రియను సులభతరం చేసి పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

---

రైతులకు సాగు ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఖరీఫ్ పంటకాలానికి రాయితీపై అందించే వరి విత్తనాల పంపిణీని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో విత్తనాల కొరత లేకుండా 31 వేల క్వింటాళ్లకు పైగా వరి విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు, అలాగే ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని మంత్రి వివరించారు.

---

తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి. ఈ ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను విడుదల చేయనున్నామని ఇంటర్ విద్య కార్యదర్శి అభిలాష ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 13 నుంచి 21 వరకు జరిగిన ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు చెందిన సుమారు 3 లక్షల 80 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారిక వెబ్‌సైట్ tgbie.cgg.gov.in ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, తెలంగాణ మీదుగా అంతర కర్ణాటక వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారిణి జి.లక్ష్మీ తెలియజేస్తూ,

వాయిస్ ..20..సెకన్లు

తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి.

---------------------------

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం త్వరితగతిన అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ కోరారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమానికి సంబంధించిన ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే రైతులు, నిరుద్యోగులు, బీసీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం పార్టీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నల్ల బెలూన్లను ఎగురవేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి నారాయణతో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

====================